క్లుప్తంగా

వారిజ ఆశ్రమంలో చినజీయర్ స్వామి తీర్థగోష్టి



భక్తులకు ప్రసాదం అందజేస్తున్న చినజీయర్ స్వామి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులోని వారిజ ఆశ్రమంలో చినజీయర్ స్వామి గురువారం తీర్థ గోష్టి నిర్వహించారు. ముందుగా ఆశ్రమంలోని వేద పాఠశాల, నేత్ర విద్యాలయం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం అక్కడికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వారిజ నిర్వాహకులు శ్రీకాంతాచార్యులు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'కి తూట్లు పొడిస్తే ఆందోళన



బంగారు నాయుడు

తగరపువలస: ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచి, కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో జరిగే అభివృద్ధి పనులను ఏకపక్షంగా తమ కార్యకర్తలకు కట్టబెట్టే చర్యలు ఉపసంహరించుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బోని బంగారునాయుడు అన్నారు. గురువారం ఆయన లక్ష్మీపురంలో మాట్లాడారు. వెండార్ సిస్టమ్ పేరుతో కూటమి ప్రభుత్వం తమ కార్యకర్తలకు ఉపాధి హామీ పనులు అప్పగించే ప్రయత్నంపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసిందన్నారు. రాష్ట్రంలో 90 శాతానికి పైగా గ్రామ పంచాయతీలు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల చేతుల్లో ఉన్నాయన్నారు. దీనిని జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ నిధులపై కన్నేసి, కాజేయడానికి కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టం-2005 ప్రకారం గ్రామీణులకు కనీస వేతనం, ఏడాదిలో వంద పని దినాలు కల్పించడం లక్ష్యంగా ఉండాలన్నారు. ఈ చట్టాన్ని దుర్వినియోగం చేసి కూటమి కార్యకర్తలకు ఉపాధిగా మారిస్తే వైఎస్సార్‌సీపీ తరపున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

బోరుబావి శిథిలం



శిథిలమైన బోరుబావి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ చిట్టివలస జ్యూట్‌మిల్లు ఒంటి వాసాలో బోరుబావి శిథిలం కావడంతో చుట్టుపక్కల వారికి తాగునీటి కష్టాలు ప్రారంభం అయ్యాయి. వీధి కుళాయిల ద్వారా జీవీఎంసీ సరఫరా చేస్తున్న తాగునీరు స్థానికుల పూర్తి అవసరాలు తీర్చలేకపోతుండటంతో చాలావరకు ఈ బోరుబావిపై ఆధారపడుతున్నారు. మిగిలిన క్వార్టర్లలో ఉన్నవారు కూడా అప్పుడప్పుడు ఈ బోరు నుంచే తాగునీటిని పట్టుకునేవారు. దీని సమీపంలోనే మిల్లు కల్యాణ మండపం కూడా ఉంది. ఇప్పుడు ఈ బోరుబావి మూలకు చేరడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని బోరుబావికి మరమ్మతులు చేయాలని, చుట్టూ శిథిలమైన ప్లాట్‌ఫారం కూడా నిర్మించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

అసలే ఎత్తు.. ఆపై గోతులు

భద్రయ్యపేట రోడ్డు వద్ద రాకపోకలకు అవస్థలు



శిథిలమైన భద్రయ్యపేట రోడ్డు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ భద్రయ్యపేట రోడ్డు ప్రవేశమార్గంలో ఛిద్రమైంది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రెడ్డిపల్లి–కోరాడ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు ముందునే గోతులు పడింది. అసలే ఎత్తు .. ఆపై ఇక్కడే రోడ్డు గోతులు పడడంతో ద్విచక్ర వాహన చోదకులు పైకి వాహనాలను ఎక్కించే ప్రయత్నంలో గోతుల్లో పడి ప్రమాదాల పాలవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి, గోతులను పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

కొబ్బరికి తెల్లదోమ గండం

కొబ్బరి రైతులను తెల్లదోమ కలవరపెడుతోంది. మూడేళ్ల క్రితం కొబ్బరి తోటల్లో విజృంభించిన తెల్లదోమ, తర్వాత వర్షాలకు తగ్గుముఖం పట్టింది. ఇటీవల నాలుగు నెలల నుంచి మళ్లీ కొబ్బరి చెట్లపై దాడి చేయడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.



అన్నవరంలో తెల్లదోమ బారిన పడిన కొబ్బరితోట





మసిబారుతున్న ఆకులు | తగ్గిపోతున్న పిందెలు | గణనీయంగా తగ్గిపోతున్న దిగుబడి | ఆందోళనలో రైతులు

తగరపువలస: భీమిలి, భోగాపురం మండల తీరప్రాంతంలో కొబ్బరితోటలను తెల్లదోమ పట్టి పీడిస్తోంది. భీమిలి మండలంలోని అన్నవరం, అమనాం పంచాయతీలలో సుమారు 600 ఎకరాలలో కొబ్బరితోటలు ఉన్నాయి. వీటిని ఆనుకుని భోగాపురం మండలంలోని తూడెం, బసవపాలెం, కవులవాడ, రావాడ, జమ్మయ్యపేట, మరడపాలెం, దల్లిపేట, దిబ్బలపాలెం తదితర పంచాయతీలలో 1500 ఎకరాల వరకు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంత రైతులు ఎకరాకు 60 నుంచి 100 వరకు కొబ్బరి చెట్లు సాగు చేస్తుంటారు. నీళ్ల బొండాలు 45 రోజులకు ఒకసారి దిగుబడి రాగా, గుజురు కాయలు 3 నెలలకు ఒకసారి దిగుబడి ఇస్తాయి. ఆరోగ్యంగా ఉన్న చెట్టు నుంచి విడతకు 40 నుంచి 60 బొండాలు లభించగా తెల్లదోమ కారణంగా వీటి సంఖ్య ప్రస్తుతం నాలుగో వంతుకు పడిపోయింది. సాధారణంగా నీళ్ల బొండాలు దించినప్పుడు ఏడాదిలో ఎకరాకు రూ.4 లక్షల వరకు, గుజురు కాయల ద్వారా రూ.2 లక్షల వరకు రైతుకు ఆదాయం లభిస్తుంది. ప్రస్తుతం తెల్లదోమ కారణంగా ఆకులు మసిబారడం, గెలకు పిందెలు తగ్గిపోవడంతో మొవ్వు వెలవెలపోతుంది. కొబ్బరితోటలనే ఆధారంగా చేసుకుని జీవిస్తున్న రైతులు తెల్లదోమ నుంచి ఉపశమన చర్యల కోసం ఎదురు చూస్తున్నారు.



తెల్లదోమ కారణంగా బూడిదగా కొబ్బరి ఆకు

మిగిలిన వాటికీ ముప్పు

కొబ్బరితో పాటు జామ, మునగ, అరటి, బొప్పాయి, మిరప ఆకుల రసాన్ని దోమ పీల్చివేయడంతో మసిబారి చెట్ల నుంచి బొగ్గు రాలుతోంది. దీంతో ఆయా తోటలలో దిగుబడి గణనీయంగా తగ్గుతోంది.

వందల కుటుంబాలకు ఉపాధి

ఈ రెండు మండలాలలో తోటలపై 1500 మంది వరకు చిన్న, పెద్ద రైతులు బతుకుతుండగా గెలలు దించడం, బొండాలు ఒలవడం, తాళ్లు, పీచు, చీపుళ్ల తయారీపై 800 వరకు కుటుంబాలు ఆధారపడి ఉంటున్నాయి. గతంలో ఈ తెల్లదోమ అమెరికా నుంచి తమిళనాడు, కేరళ మీదుగా తూర్పుగోదావరి జిల్లా కడియం నర్సరీ మీదుగా ఉత్తరాంధ్రలో ప్రవేశించినట్టు కొబ్బరి రైతులు అంటున్నారు. వేప నీరు, వాషింగ్ పౌడర్ నీటిని పిచికారీ చేస్తే తెల్లదోమను సులువుగా అరికట్టవచ్చని అవగాహన కలిగిన రైతులు అంటున్నా, మిగిలిన రైతులకు దీనిపై అవగాహన లేదనే అనిపిస్తుంది.

తెల్లదోమ నివారణ ఇలా..

- గతంలో తెల్లదోమ నివారణకు ఉద్యానవనశాఖ కల్పించిన అవగాహన మేరకు ఒకరో, ఇద్దరో రైతులు వాటిని ఆచరిస్తున్నారు.
- తెల్లదోమను ఆకర్షించడానికి ఆకుపచ్చ, పసుపు పచ్చని అట్టలకు జిగురు రాసి తోటలలో వేలాడదీస్తే సాయంత్రం వేళ బయటకు వచ్చిన దోమలు వీటికి అంటుకుని మరణిస్తాయి.
- 1.50 నుంచి రెండు అడుగుల టార్పాలిన్లపై ఆముదం రాసి కొబ్బరిచెట్ల కాండం చుట్టూ అమర్చాలి. వీటికి కూడా దోమలు అంటుకుని మరణిస్తాయి. వీటికి ఖర్చు కూడా తక్కువే.
- పదివేల పీపీఎం గాఢత కలిగిన వేపనూనెలో బట్టలు ఉతికే పౌడర్‌ను కలిపి పిచికారీ చేసుకోవాలి.
- 500 మిల్లీ లీటర్ల ఇసారియా ఫ్యూమోజోరోజియా శిలీంద్రం కలిగిన ద్రావణంలో రెండు కిలోల బెల్లం, రెండు కిలోల గంజి ద్రావణం వంద లీటర్ల నీటిలో కలపాలి. నాలుగు రోజుల తరువాత మరో రెండు కిలోల గంజి ద్రావణాన్ని చేర్చాలి. ఇలా తయారైన అయిదు మిల్లీ లీటర్ల ద్రావణానికి పది గ్రాముల డిటర్జెంట్‌ను కలిపి హైస్పీడ్ స్ప్రేయర్ ద్వారా వారం వ్యవధిలో మూడు సార్లు చెట్టంతా పిచికారీ చేయాలి.

ప్రత్యక్ష అవగాహన కల్పించాలి



కొబ్బరి రైతులలో చాలామంది నిరక్షరాస్యులే. తెల్లదోమను నివారించే మార్గం తెలియక నష్టపోతున్నాం. సచివాలయాలకు అనుసంధానంగా ఉన్న రైతు సహాయక కేంద్రాల ద్వారా నష్ట నివారణ చర్యలు చేపట్టాలి. అధికారుల ద్వారా అవగాహన కల్పించాలి. – సీహెచ్ అప్పారావు, తూడెం

ఉపాధికి ఇబ్బంది



కొబ్బరి తోటల్లో సాగు నుంచి బొండాలు దించడం, కాయలు ఒలవడం, మోతకూలి, పీచు, తాళ్లు, థియేటర్, బస్సులలో సీట్ల తయారీ వంటి అనుబంధ పరిశ్రమలలో భీమిలి, భోగాపురం మండలాల నుంచి 800 మంది వరకు ఆధారపడి ఉన్నారు. ఇప్పుడు తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గితే ఉపాధికి ఇబ్బంది కలుగుతుంది. –పూర్ల రామసూరి, బసవపాలెం

ఎలా వదిలించుకోవాలో తెలియట్లేదు



నాలుగు నెలల క్రితం వరకు గెలలు, కాయలతో నిండుగా కనిపించిన చెట్లు ఇప్పుడు పూతలేకుండా ఖాళీగా కనిపిస్తున్నాయి. తెల్లదోమను వదిలించుకుంటే తప్ప రైతు బతికి బట్టకట్టే పరిస్థితి కనిపించడం లేదు. –చిలుకోటి చిన్నారావు, అన్నవరం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం: పద్మనాభం సబ్ స్టేషన్ పరిధిలోని గంధవరం ఫీడర్‌లో ప్రాజెక్టు పనులు చేపట్టనున్నందున సంబంధిత గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఆ రోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు మద్ది, విలాస్కాన్‌పాలెం, తునిపాలెం, బాందేవుపురం, విజయరాంపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

నేటితో ముగియనున్న రామాయణ ప్రవచనాలు

మధురవాడ: మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అష్టలక్ష్మీ దేవాలయం, గాయత్రి విద్యాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో సంపూర్ణ శ్రీరామాయణంపై చాగంటి కోటేశ్వరరావు గత 41రోజులుగా నిర్వహిస్తున్న ప్రవచనాలు శుక్రవారంతో ముగియనున్నాయి. గురువారం ప్రవచనాల్లో భాగంగా యుద్ధకాండలో రావణవధకు కావలసిన తేజస్సు కోసం అగస్త్య మహర్షి శ్రీరామునికి అత్యంత శక్తివంతమైన ఆదిత్య హృదయ ఉపదేశం, రావణ వధ, సీతమ్మ అగ్ని ప్రవేశం ఘట్టాలను తెలియజేశారు. పరమ శివుని ఆజ్ఞ మేరకు 11వేల సంవత్సరాలు భూమిని పాలించుటకు పట్టాభిషేకమునకు శ్రీరాముడు అయోధ్యకు బయల్దేరడం తదితర అంశాలను చాగంటి వివరించారు.

ఎల్లమ్మతల్లి ఉత్సవాలు ప్రారంభం

తగరపువలస: ఎల్లమ్మతల్లి ఉత్సవాలు భీమిలి, ఆనందపురం మండలాల్లో గురువారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల ఉత్సవాలు శుక్రవారం అనుపుతో ముగియనున్నాయి. జీవీఎంసీ రెండోవార్డు సంగివలసలో ఎల్లమ్మతల్లి ఇంటి వద్ద నుంచి పూజారి అప్పారావు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. పూజారి వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అక్కరమాని మంగరాజు, అక్కరమాని గంగాధర్ వెళ్లారు. ఆనందపురం మండలం పొడుగుపాలెంలో పోతురాజు సంబరం నిర్వహించారు. రెండు రోజుల పాటు ఉత్సవ కమిటీ ప్రతినిధులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



సంగివలసలో ఊరేగింపుగా వస్తున్న పూజారి అప్పారావు

దర్జాగా కబ్జా

ప్రభుత్వ భూములపై బడాబాబుల కన్ను



రుషికొండ ఐటీ జంక్షన్ వద్ద ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రుషికొండ ఐటీ జంక్షన్ సమీపంలో సుమారు 480 గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. ప్రధాన రహదారి నుంచి ఐటీ హబ్‌కు వెళ్లే మార్గమధ్యలో సర్వే నెం. 1/1 లో ఓ వ్యక్తి రాత్రికి రాత్రే చెట్లు తొలగించి, స్థలాన్ని చదును చేసి ఆక్రమించేందుకు సిద్ధమయ్యాడు. ఈ ప్రాంతంలో గజం సుమారు లక్ష రూపాయలు పలకడంతో బడాబాబుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. రెవెన్యూ అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకోవడంతో ఆక్రమణదారులకు హద్దూ అదుపూ లేకుండా పోతోంది.

- స్వర్ణ భారతి నగర్ సమీపంలో రుషికొండ గెడ్డను ఓ వ్యక్తి స్థానిక నాయకుడి సహకారంతో మట్టితో కప్పేసి ఆక్రమించుకున్నాడు. తాత్కాలికంగా రెండు షెడ్‌లను ఏర్పాటు చేసి, పాత కరెంటు మీటర్లు ఏర్పాటు చేసుకుని ఆ ప్రాంతాన్ని మొత్తం స్వాధీనం చేసుకున్నాడు.

పార్కు స్థలం మాయం

బీచ్ రోడ్డు సాగర్‌నగర్ సమీపంలో శాంతినికేతన్ లేఅవుట్‌లో ఓ వ్యక్తి పార్కు స్థలాన్ని కబ్జా చేసి దర్జాగా గోడ కట్టి గ్రావెల్ నింపి, చక్కగా చదును చేసి స్వాధీనం చేసుకున్నాడు. కోట్లు విలువ చేసే పార్కు స్థలం ఆక్రమణ సచివాలయానికి అతి సమీపంలో జరిగినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. లేఅవుట్ ప్లాన్‌లో పార్కు స్థలం చూపించినా బయట పార్కు స్థలం మాయమైపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఈ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా సర్వేయర్‌ను రప్పించి రీ సర్వే చేస్తామని, ఒక్క సర్వేయర్ ఉండటంతో సర్వే చేయడం ఆలస్యం అవుతుందని తెలిపారు. అంతవరకు ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైనా తమకు సంబంధం లేదని అధికారులే చెప్పడం వెనుక అంతరార్థం ఏమిటో వారికే తెలియాలి. రుషికొండ, స్వర్ణభారతినగర్, సాగర్‌నగర్‌లో జరుగుతున్న భూఆక్రమణలపై తహసీల్దార్ పాల్ కిరణ్‌ను వివరణ కోరగా ప్రభుత్వ స్థలం ఎంతటివారు ఆక్రమించినా ఉపేక్షించేది లేదని, ఆక్రమిత స్థలాలను వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రహదారి అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలి

వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్



మధురవాడలో రోడ్డు మ్యాప్‌ను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

మధురవాడ: వీఎంఆర్‌డీఏ పరిధిలో రహదారుల అభివృద్ధి ప్రణాళికను సాధ్యమైనంత త్వరగా సిద్ధం చేయాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ప్రణాళిక విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా గురువారం ఆయన మధురవాడలోని పలు ప్రాంతాలను సందర్శించారు. మిథిలాపురి కాలనీ నుంచి వాంబే కాలనీకి 750 మీటర్ల పొడవునా 80 అడుగుల ప్రతిపాదిత విస్తరణ రహదారికి అంచనాలు రూపొందించాలని చెప్పారు. రేవళ్లపాలెం, బక్కన్నపాలెం గ్రామాల వద్ద చాలాకాలంగా అసంపూర్తిగా ఉన్న బృహత్ ప్రణాళిక రహదారులను పరిశీలించారు. ఈ రహదారుల పనులు ఆగిపోవడానికి కారణాలు, ఎక్కడెక్కడ టీడీఆర్ ఇవ్వాలి, పూర్తి చేయడానికి ఏ చర్యలు చేపట్టాలి, ఎంత నిధులు అవసరం తదితర అంశాలను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. రేవళ్లపాలెం గ్రామంలో పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ పరిస్థితి, ఎంతమందికి, ఎంత ఇవ్వాలి తదితర అంశాలు వెంటనే అందజేయాలన్నారు. సాధ్యమైనంత త్వరగా టీడీఆర్‌లను పంపిణీ చేసే విధంగా చూడాలని జీవీఎంసీ ప్రధాన పట్టణ ప్రణాళికా అధికారికి సూచించారు. తద్వారా రహదారిని పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. తాను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని చెప్పారు. ఈ పర్యటనలో జీవీఎంసీ డీసీపీ హరిదాసు, వీఎంఆర్‌డీఏ సీయూపీ శిల్ప, ఎస్ఈ వినయ్ కుమార్, భవానీ శంకర్, ఎల్ఏవో వేణుగోపాల్, ప్లానింగ్ ఆఫీసర్ వెంకటేశ్వర రావు, ఈఈ దుర్గా ప్రసాద్, ఏఈఈ శిరీష తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో కలలు సాకారం



సావనీర్ ఆవిష్కరిస్తున్న ఇన్ఫోసిస్ సెంటర్ హెడ్ సురేష్ తదితరులు

తగరపువలస: ప్రతి విద్యార్థి శ్రమించి, నైపుణ్యం సాధించడం ద్వారా కలలు సాకారం చేసుకోవాలని ఇన్ఫోసిస్ విశాఖ డెలివరీ సెంటర్ హెడ్ నర్రా సురేష్ అన్నారు. సంగివలస అనిట్స్‌లో గురువారం నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఐవోటీ, వీఎల్ఎస్ఐ, ఫైవ్ జీ కమ్యూనికేషన్స్ వంటి ఆధునిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. విద్యార్థులు కొత్త టూల్స్ నేర్చుకుని సన్నద్ధంగా ఉంటే అద్భుతమైన అవకాశాలు సొంతమవుతాయన్నారు. ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ మాట్లాడుతూ కళాశాలలో తరచూ సాంకేతిక సదస్సులు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి సావనీర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి బండి జగదీష్, అకడమిక్ హెడ్ రాజ్యలక్ష్మి, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



చంద్రంపాలెం హైస్కూల్లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటశేషమ్మ

మధురవాడ: మైనర్ బాలికలపై అకృత్యాలు ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ సూచించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోనే పెద్దది అయిన ఈ పాఠశాలలో పేరు పేరునా పర్యవేక్షణ చేయడం కష్ట సాధ్యమని, అందుచేత ప్రతి విద్యార్థి తమ హక్కులు, బాధ్యతలు, పరిమితులు తెలుసుకోవాలని తెలిపారు. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ ను అర్థం చేసుకుని, తప్పుగా ప్రవర్తించిన వారిపై ఫిర్యాదు చేయాలన్నారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ కోసం 2012లో పోక్సో(ప్రివెన్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్) చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు.

కమిటీ తప్పనిసరి

ఆమె ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. చట్ట ప్రకారం పాఠశాలలో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ చట్టం గురించి ఇంకా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రవి, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ డాక్టర్. జె. చంద్రశేఖరరావు, జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ జ్యోతి, సమగ్ర శిక్ష అభియాన్ జీసీడీవో ఖలీషాబేగం, ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని నడుపూరుకు చెందిన నాగోతి సత్యనారాయణ లక్ష రూపాయల విరాళాన్ని గురువారం అందించారు. సంబంధిత చెక్కును సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

మధురవాడ: మహిళలు అన్ని రంగాల్లో ముందున్నప్పుడే అభివృద్ధి సాధ్యం అవుతుందని ఐద్వా, సీఐటీయూ నాయకులు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం కొమ్మాది జంక్షన్ నుంచి మార్కెట్, అప్ బ్రిడ్జి మీదుగా జీవీఎంసీ జోనల్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల హక్కులు, సాధికారత, సమస్యలపై ప్లకార్డులు, బ్యానర్లతో నినాదాలు చేశారు. మధురవాడ జోనల్ ఆఫీసు వద్ద నిర్వహించిన సభలో ఐద్వా నాయకురాలు బి.భారతి, డీవైఎఫ్ఐ నాయకులు ఉమామైలజ, సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు డి.కొండమ్మ, రాజ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. మహిళా దినోత్సవ స్ఫూర్తితో మహిళల హక్కుల కోసం పోరాడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జి.మంగశ్రీ, ఎస్‌వీ శ్రీదేవి, సుజాత, లలిత తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ మహిళా నాయకులు

స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలి

తగరపువలస: స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి డిమాండ్ చేశారు. భీమిలి జోన్ ఆధ్వర్యంలో మహిళలతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలను ఇంకా అణచివేతకు గురి చేస్తున్న మనువాద సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న బీజేపీ లాంటి పార్టీలు దేశానికి ప్రమాదకరమన్నారు. మహిళలంతా తమను తాము కాపాడుకుంటూ స్వేచ్ఛ, సమానత్వం, రక్షణ, ఉపాధి కోసం పోరాటాలు చేయాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ర్యాలీలో సీఐటీయూ నాయకులు రవ్వ నరసింగరావు, ఎం.శ్రీదేవి, కె.పద్మావతి, అప్పయ్యమ్మ, సూరమ్మ, అపర్ణ, కుంచమ్మ తదితరులు పాల్గొన్నారు.



మధురవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా, సీఐటీయూ శ్రేణులు

పెళ్లి ముహూర్తాల వేళ పువ్వులకు డిమాండ్

పూలదండలకు విస్తృతంగా ఆర్డర్లు



అమ్మవార్ల అలంకరణకు తయారైన గజమాలలు



పెళ్లిళ్ల కోసం సిద్ధం చేసిన పువ్వుల దండలు

తగరపువలస: ఈ నెల 7వ తేదీన ముమ్మరంగా పెళ్లిళ్లు ఉండటంతో పువ్వులకు, పూలదండలకు మార్కెట్‌లో అమాంతం డిమాండ్ పెరిగిపోయింది. పెళ్లివారి అభిరుచి మేరకు పెళ్లిదండలు, అలంకరణకు బంతి, చేమంతి, గులాబీ, లిల్లీ, మల్లె, కనకాంబరం, జాజులు, కాగడాలు, తులసి ఉపయోగించి దండల తయారీకి ఆర్డర్లు వస్తున్నాయి. పెళ్లింటి వారు అమ్మవార్లకు చెల్లించే మొక్కుల కోసం గజమాలల కోసం కూడా ఆర్డర్లు పెడుతున్నారు. అలంకరణ కోసం ప్లాస్టిక్, థర్మాకోల్ తదితర మెటీరియల్‌తో దండలు మార్కెట్‌లో లభ్యమవుతున్నా పచ్చి(తాజా) పూలదండల వైపే ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. పెద్ద వ్యాపారులు పువ్వులు, దండలు వాడిపోకుండా కూలింగ్ ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇలాంటి జాగ్రత్తలు తీసుకోలేని వ్యాపారులు మాత్రం ఏ రోజు పువ్వులు, దండలు ఆ రోజు విక్రయం కాకపోతే మార్కెట్ బయటే పారవేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో తెల్ల చేమంతి కిలో రూ.150, వివిధ రంగుల చేమంతులు రూ.120, హైబ్రిడ్ గులాబీ రూ.130, దేశవాళీ గులాబీ వంద రూ.80, లిల్లీ రూ.100, మల్లెలు రూ.400, కనకాంబరం రూ.600, దండలు పువ్వుల రకాలను బట్టి రూ.100 నుంచి రూ.500, గజమాలలు రూ.1500 నుంచి అందుబాటులో ఉన్నాయి.